## 'ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

చిక్కడపల్లి, మే 2: అత్యంత వెనుకబడిపోయిన బేడ బుడగ జంగాలకు ప్రత్యేకంగా రూ. 10000 కోట్ల కార్పొరేషన్ ఏర్పాటు చేసి అభివృద్ధికి తోడ్పడాలని బేడ బుడగ (జంగం) హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు గగనం మంతప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బేడ బుడగ (జంగం) కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గగనం మంతప్ప, సమితి వ్యవస్థాపక చైర్మన్ గగనం శ్రీనివాసులుతో కలిసి మాట్లాడారు. వర్గీకరణలో ఏ గ్రూపులో ఉన్న తాము అన్ని విధాలుగా వెనుకబడి ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బేడ బుడగ జంగాల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్నారు. ఈ సమావేశంలో బేడ బుడగ జంగాల సమితి నాయకులు తూర్పాటి హనుమంతు, సిరివాటి శ్రీనివాసులు, తూర్పాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్‌పోర్టులో ప్రయాణికుడు మృతి

శంషాబాద్ రూరల్ : రాంచి నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ప్రయాణికుడు మృతి చెందిన ఘటన శుక్రవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో జరిగింది. ఎయిర్‌పోర్టు అవుట్‌పోస్టు సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఆజాద్(47) బీదర్‌లోని షాహిన్ విశ్వవిద్యాలయంలో రెండో సంవత్సరం చదువుతున్న తన కూతురు నస్రీంను కళాశాలకు పంపించడం కోసం గురువారం రాంచి నుంచి ఇండిగో విమానంలో శంషాబాద్‌కు చేరుకున్నాడు. ఎయిర్‌పోర్టులోని ఫిల్లర్ నంబర్ రెండు వద్దకు రాగానే ఒక్కసారిగా కిందపడిపోయాడు. అపోలో దవాఖానకు తరలించగా గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నీట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

సిటీబ్యూరో/మేడ్చల్: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ నెల 4న నీట్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా 13 కేంద్రాల్లో పరీక్షలు జరగగా 4336 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్షా కేంద్రాలకు అనుమతించి గేట్లను మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో మెడికల్ కిట్లు, అంబులెన్స్ ఏర్పాట్లను చేయనున్నారు. దివ్యాంగుల అభ్యర్థులకు వీల్‌చైర్ సౌకర్యం కల్పించేలా సంక్షేమాధికారిని ఆదేశించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. పరీక్ష కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు.

# నిబంధనలు.. ఉల్లంఘనలు

- నాలుగు ఫ్లోర్‌లకు అనుమతి కట్టింది ఆరు అంతస్తులు
- రహదారులను ఆక్రమించి ఆసుపత్రి నిర్మాణం
- ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని ప్రైవేటు దవాఖానలో హైడ్రా బృందం



అధికారులను వివరణ కోరుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో, మే 2(నమస్తే తెలంగాణ): ఆసుపత్రి నిర్మాణంలో ఇన్ని ఉల్లంఘనలు ఉంటే ఎలా.. అసలు భవన నిర్మాణంలో ప్రత్యేకించి హాస్పిటల్ నిర్మించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు ఎందుకు తీసుకోలేదంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్థానిక అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని డాక్టర్ శంకర్స్ ఆసుపత్రి నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ స్థానికుల నుంచి ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలో ఆసుపత్రి నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రహదారులను ఆక్రమించి నాలుగు అంతస్తుల భవననిర్మాణానికి అనుమతులు తీసుకుని సెల్లార్‌తో పాటు ఆరు అంతస్తులను ఎలా నిర్మిస్తారని భవన యజమానిని రంగనాథ్ అడిగారు. నివాసప్రాంతాల మధ్య ఇరుకు దారుల్లో భవననిర్మాణం జరుగుతున్నదని, భవిష్యత్‌లో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. దీనిపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ చీఫ్ ప్లానర్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఈ పర్యటనలో హైడ్రా కమిషనర్‌తో పాటు హైడ్రా ఫైర్ విభాగం అడిషనల్ డైరెక్టర్ పాపయ్య, డీఎఫ్ఓ యజ్ఞనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రూ.7 కోట్లతో బతుకమ్మ కుంట అభివృద్ధి

బతుకమ్మ కుంట అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులకు సూచించారు. శుక్రవారం బతుకమ్మకుంట పనులను హైడ్రా బృందంతో కలిసి రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రూ.7 కోట్లతో చెరువును అభివృద్ధి చేస్తున్నామని, వచ్చే బతుకమ్మ ఉత్సవాల నాటికి చెరువు పూర్తవ్వాలని, త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బతుకమ్మ కుంట సందర్శనకు రానున్నారని, ఈ లోగా చెరువు ఒక రూపం సంతరించుకోవాలని ఆయన సూచించారు. అభివృద్ధి పనులను చేపట్టిన కాంట్రాక్టర్లకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా హైడ్రా అధికారులు చూడాలని, చెరువు ఇన్‌లెట్లు, ఔట్‌లెట్ల ద్వారా వర్షపు నీరు రాకపోకలకు సంబంధించి చర్యలు చేపట్టాలని కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు.

# పాఠశాలా.. ఇసుక డంపింగ్ యార్డా?

- పట్టించుకోని అధికారులు..
- నీట్ పరీక్ష కేంద్రం ఏర్పాటు
- అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం



బాలాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇసుక, కంకర, సిమెంటుతో నింపేసిన దృశ్యం

బడంగ్ పేట, మే 2: బాలాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఇసుక డంపింగ్ యార్డ్‌గా మార్చేశారు. ఈనెల 4న నీట్ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికే పరీక్షా కేంద్రాన్ని బాలాపూర్ తహసీల్దార్ ఇందిరా దేవి, డీటీ మణిపాల్ రెడ్డి, పరీక్షల అబ్జర్వర్లు నీట్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలో ఉన్న ఇసుక దిబ్బలను, కంకర, డస్టు, సిమెంటు మైదానం నిండా వేసి ఉండడంతో అవాక్కయ్యారు. నీట్ పరీక్ష ఉందని స్థానిక ప్రధానోపాధ్యాయుడు చెప్పినా.. బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. రోడ్ల పనులు చేయడానికి కాంట్రాక్టర్ గ్రౌండ్ నిండా ఇసుక డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేశాడు. గ్రౌండ్ లో ఉన్న వాటిని మొత్తం తొలగించాలని మూడు రోజులుగా చెబుతున్నా.. వినకుండా సదురు కాంట్రాక్టర్, ఓ అధికార పార్టీకి చెందిన తాజా మాజీ కార్పొరేటర్ గ్రౌండ్‌లో ఉంటే ఏమవుతుందని ఉపాధ్యాయులను బెదిరించినట్లు సమాచారం. నీటు పరీక్షా కేంద్రాల దగ్గర ఎలాంటి సమస్యలు ఉండకూడదని జిల్లా కలెక్టర్ ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనేకసార్లు మండల స్థాయి అధికారులు పాఠశాలను పరిశీలించి పాఠశాలలో ఉన్న వసతుల గురించి ఆరా తీశారు. అధికార పార్టీ నేతల తీరుతో అధికారులు విసుక్కుంటున్నారు. పై అధికారులకు సమాధానం చెప్పుకోలేక తర్జన భజన పడుతున్నారు.

### మూడు రోజులుగా చెబుతున్నాం..

బాలాపూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఇసుక డంపింగ్ యార్డు ఎత్తివేయాలని మూడు రోజులుగా చెబుతున్నాం. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆదివారం పాఠశాలలో నీట్ ఎగ్జామ్ ఉంది. గ్రౌండ్ నిండా ఇసుక, కంకర, డస్టు, సిమెంటు వేశారు. పరీక్ష సమయంలో ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. గ్రౌండ్లో ఉన్న వాటిని తొలగించాలని పదేపదే చెబుతున్నాం. ఎవరూ వినడం లేదు. రెండు రోజులలో తొలగించకపోతే పై అధికారులకు ఫిర్యాదు చేస్తాం. – రామాంజనేయులు, ప్రధానోపాధ్యాయుడు

## ట్రంప్ విధానాలు శాంతికి తోడ్పడవు

చిక్కడపల్లి, మే 2: ట్రంప్ విధానాలు ప్రపంచశాంతికి తోడ్పడవు.. కార్పొరేట్లకు మాత్రమే అనుకూలం- ప్రపంచశాంతికి కాదు అని మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కే నాగేశ్వర్ ఎద్దేవా చేశారు. టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఉద్యమ జాతీయ నాయకులు, యూటీఎఫ్ ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ,మాజీ ఎమ్మెల్సీ దాచూరి రామిరెడ్డి 9వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేశారు. స్మారకోపన్యాసం టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రధాన వక్తగా ప్రొఫెసర్ నాగేశ్వర్ హాజరై రామిరెడ్డి ఒక గొప్ప మానవతావాది అని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు ఎస్‌టీ ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం సంయుక్త యూటీఎఫ్ సీనియర్ నాయకులు నరహరి, టీపీపీఆర్ఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్, ఉపాధ్యక్షులు జంగయ్య, కోశాధికారి లక్ష్మారెడ్డి, మాణిక్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సోమశేఖర్, సమ్మారావు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బంజారా సంఘం నాయకులు

## బంజారాల బలోపేతమే లక్ష్యం

చిక్కడపల్లి, మే 2: గిరిజనుల ఆదివాసుల హక్కుల సాధన కోసం ముందుకు సాగుదాం అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. అందులో భాగంగా తెలంగాణ జాగృతి ఎస్టీసెల్ విభాగం బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. తెలంగాణ బంజారా జాగృతి ఎస్టీ విభాగం కమిటీల ఏర్పాటు కోసం శుక్రవారం పలు బంజారా సంఘాలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రూప్ సింగ్ , సేవాలాల్ సేన గ్రేటర్ అధ్యక్షుడు వడ్త్య కళ్యాణ్ నాయక్, హరి సింగ్ తదితరులు హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ బంజారా సంఘాల బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలని నాయకులకు సూచించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో స్త్రీలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. నగరంలో పెద్ద ఎత్తున ఉన్న బంజారాలను ఏకతాటి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆమె సూచించారు. అదే విధంగా రూప్ సింగ్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవేందర్ నాయక్..లంబాడి తండా.. బాపూనగర్ బస్తీ అధ్యక్షుడు హరి సింగ్ జాదవ్ దవ్, జానీ నాయక్ ,శివ నాయక్, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

## తులం బంగారం ఎప్పుడిస్తరు?

### కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ఆర్‌కేపురం, మే 2: సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన 420 హామీలు అమలు చేసేంత వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజన్లకు మంజూరైన 99 కల్యాణ లక్ష్మి , షాదీముబారక్ చెక్కులను శుక్రవారం సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ పేదింటి ఆడబిడ్డల వివాహాలకు రూ. 1,00,116 మాత్రమే ఇస్తున్నారంటూ.. తాము అధికారంలోకి వస్తే రూ. 1,00,116 లతోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చారన్నారు. తులం బంగారం ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఇష్టం వచ్చినట్లు హామీలు ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేస్తామని పదేపదే చెబుతున్నదని, కోటి మంది మహిళల్లో ఏ ఒక్క మహిళా కోటీశ్వరురాలు కాలేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, డీటీ జంగయ్య, స్థానిక కార్పొరేటర్ శ్రీవాణి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ యూత్ వింగ్ మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్లల్లో ఉండకుంటే.. రద్దు చేస్తాం

### 'డబుల్ బెడ్రూం'లో నివాసముండని లబ్ధిదారులకు నోటీసులు



మల్కాజిగిరి జిల్లాలోని డబుల్‌బెడ్రూంలు

మేడ్చల్, మే2(నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లాలో డబుల్ బెడ్రూంలు కేటాయించిన ఇండ్లలో లబ్ధిదారులు నివాసం లేనట్లయితే మరోసారి నోటీసులు ఇచ్చి రద్దు చేస్తామని మొబైల్ ఫోన్లకు సందేశాలు రావడంతో పలువురు ఆందోళన చెందుతున్నారు. సందేశాలు వచ్చిన లబ్ధిదారులు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చి వినతి పత్రాలు సమర్పిస్తున్నారు. డబుల్ బెడ్రూంలలో చేరకుంటే రద్దు చేస్తారా.. తమకు సమస్యలు ఉన్నందువల్లే చేరడం లేదని..కొంత సమయం ఇవ్వాలని అధికారులకు వినతి పత్రాల ద్వారా కోరుతున్నారు. మరోసారి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతుండటంతో లబ్ధిదారులు హైరానా పడుతున్నారు. ఇండ్లు లేని వారికి అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూలను కేటాయిస్తే అధికారులు మాత్రం వరుసుగా హెచ్చరిక నోటీసులు, సందేశాల పేరిట లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. మేడ్చల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కేటాయించిన డబుల్ బెడ్రూంలలో ఇప్పటి వరకు 5,614 మంది లబ్ధిదారులు చేరలేదని అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలోని దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని అహ్మద్‌గూడలో 1,767 మంది, నాగారం మున్సిపాలిటీ పరిధిలో 364, కొర్రెముల శ్రీరాంనగర్‌లో 98, బాచ్‌పల్లిలో 181, డీ పోచంపల్లిలో 217, దుండిగల్ 337, నిజాంపేటలో 875, బాచుపల్లి 2లో 431, బహదూర్‌పల్లిలో 155, దుండిగల్‌లో 450, గాజులరామారంలో 112, కైసర్‌నగర్‌లో 549 లబ్ధిదారులు డబుల్‌బెడ్రూంలలో చేరాల్సి ఉంది. ఇండ్లలో చేరని వారిపై అధికారులు సీరియస్‌గా తీసుకుంటున్నారు. ప్రస్తుతం అనేక మంది ఇండడ్లు లేని వారు గృహాల కోసం దరఖాస్తులు చేసుకున్న నేపథ్యంలో డబుల్‌బెడ్రూం ఇండ్లను రద్దు చేసి ఇతరులకు కేటాయిస్తామన్న ప్రచారం జరుగుతున్న క్రమంలో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చి తమ డబుల్‌బెడ్రూంలను రద్దు చేయవద్దని అధికారులను వేడుకుంటున్నారు.

## నీట్ అభ్యర్థులకు యూట్యూబ్ ఛానల్




సిటీబ్యూరో, మే 2 (నమస్తే తెలంగాణ): నీట్, జేఈఈ అభ్యర్థుల కోసం ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ యూట్యూబ్ ఛానల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ చీఫ్ అకడమిక్ అండ్ బిజినెస్ హెడ్ ధీరజ్ మిశ్రా తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన ఈ చానెల్ ద్వారా 8, 12వ తరగతి విద్యార్థులకు వారి మాతృ భాషల్లోనే ఫిజిక్స్, కెమెస్ట్రీ, మ్యాథ్, జంతుశాస్త్రం తదితర కీలక సబ్జెక్టులను బోధిస్తున్నట్లు తెలిపారు.

## రాజ్యాంగమే అత్యున్నతమైనది

చిక్కడపల్లి, మే 2: దేశంలో రాజ్యాంగమే అత్యున్నతమైనదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సాయంత్రం గవర్నర్ల పాత్ర, రాజ్యాంగ న్యాయస్థానాలు, భారత రాజ్యాంగం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్‌కు పూర్తి అధికారం ఉండాలని, రాష్ట్రపతికి, గవర్నమెంట్ లకు సుప్రీంకోర్టు ఆజ్ఞలు జారీ చేయవద్దని చెప్పడం రాజ్యాంగ ప్రకారం సరైనది కాదన్నారు. వేదిక నాయకుడు ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీనియర్ సంపాదకుడు కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




గన్‌పార్క్ వద్ద నిరసన తెలిపిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసిన బీఆర్‌ఎస్వీ విద్యార్థి నాయకులు

## ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై జరుగుతున్న హత్యాకాండను వెంటనే నిలిపివేయాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మూడు వారాలుగా ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ సరిహద్దు ప్రాంతానికి వ్యాపించి ఉన్న కర్రెగుట్ట ప్రాంతంలో మావోయిస్టులను ఏరివేయాలనే లక్ష్యంతో ఆపరేషన్ కగార్ పేరుతో మారణ హోమం సృష్టిస్తోందని ఆరోపించారు. వేలాదిమంది సాయుధ బలగాలతో అమాయక ఆదివాసీ గిరిజనులను చంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆ ప్రాంతం నుంచి సాయుధ బలగాలను ఉపసంహరించి కర్రెగుట్ట ప్రాంతంలో శాంతి నెలకొల్పాలని కోరారు. ఆపరేషన్ కగార్ కు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీను నాయక్ మాట్లాడుతూ మావోయిస్టులపై జరుగుతున్న దమనకాండను నిలిపివేయాలని ఎల్కతుర్తి మహాసభలో కేసీఆర్ డిమాండ్ చేశారని గుర్తు చేశారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు గోపాల్ నాయక్, క్రాంతి నాయక్, సంతోష్ నాయక్, రాజేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ మీటర్ల గోల్ మాల్

(మొదటిపేజీ తరువాయి)

అసలు మీటర్లు చెన్నకేశవరెడ్డికి ఎక్కడి నుంచి వచ్చాయి.. ఎవరిచ్చారు... ఒకేసారి ఇన్ని మీటర్లు ఎందుకు అక్రమంగా నిల్వ చేశారు. 24 గంటల్లో బిగించాల్సిన మీటర్లు ఎందుకు అక్రమంగా దాచి ఉంచారు.. అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. కాగా తమకు మీటర్లు తక్కువ పడడంతో పాటు చాలా మీటర్లు రిటర్న్ రాకపోవడంతో ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు అధికారులు చెప్పారు. అయితే దొరికిన మీటర్లు గచ్చిబౌలి డివిజన్‌కు చెందినవిగా అధికారులు చెబుతుండగా, మరి ఇబ్రహీంబాగ్‌లో కనిపించకుండా పోయిన మీటర్లు ఎక్కడున్నాయనేది ఇప్పుడు మరో వివాదమైంది. ముఖ్యంగా మీటర్ల మిస్సింగ్, ఆ తర్వాత పెద్ద ఎత్తున దొరకడంతో ఇలా ఇంకెన్ని చోట్ల ఉన్నాయనే కోణంలో విద్యుత్ విజిలెన్స్ అధికారుల విచారణ కొనసాగుతోంది. శివారు ప్రాంతాల్లోనే ఈ తరహా గోల్‌మాల్ సంఘటనలు జరిగి ఉంటాయని, అసలు ఉన్న మీటర్లు ఎన్ని.. మిస్ అవుతున్నవెన్ని.. అనే అంశాలతో సవివరంగా తమకు నివేదిక తెప్పించుకోవాలని, దీనిపై సీఎండీతో మాట్లాడిన తర్వాత ఒక నిర్ణయానికి వస్తామని విజిలెన్స్ అధికారి ఒకరు చెప్పారు.

### విచారణ చేస్తున్నాం..

మీటర్లు మా దగ్గర మిస్ అయిన విషయాన్ని గమనించి మా పై అధికారులకు తెలిపాం. విజిలెన్స్ అధికారులు విచారణ చేసే క్రమంలోనే టెలికంనగర్‌లో ఉన్న మీటర్లను మరో చోటికి మార్చినట్లు తెలిసింది. దీంతో రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశాం. వారు సీసీ పుటేజ్, ఇతర సాంకేతిక అంశాలను పరిశీలించి 42 మీటర్లను రాయదుర్గంలోని టెలిఫోన్‌కాలనీలోని ఓ ఇంటిలో పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో చెన్నకేశవరెడ్డి అనే కాంట్రాక్టరే మీటర్లు ఒకచోట నుంచి మరో చోటకు మార్చారని తెలిసింది. అసలు నిబంధనలకు విరుద్ధంగా వాటిని ఎలా పొందారనే విషయంపై పోలీసులతో పాటు మా శాఖ తరపున విజిలెన్స్ అధికారులు విచారణ చేస్తున్నాం. మీటర్ ఇచ్చేటప్పుడు లైన్‌మెన్, ఇన్‌స్పెక్టర్ టెస్ట్ రిపోర్ట్‌ను ఏఈకి పంపాలి. వీటిని ఏఈ అనుమతి ఇచ్చిన తర్వాత మీటర్లు ఇస్తారు. 42 మీటర్లు ఎలా తీసుకెళ్లారనే విషయంలో సర్వీస్ నంబర్, ఇంటి నంబర్‌లతో సహా ప్రతీ అంశాన్ని పరిశీలించి విచారిస్తున్నాం. – అంబేద్కర్, ఏడీఈ, ఇబ్రహీంబాగ్

## తెలంగాణలో ఆన్‌లైన్ జూదం రెట్టింపు

### ప్రహార్ జాతీయ కన్వీనర్ అభయ్ రాజ్ మిశ్రా



ఖైరతాబాద్, మే 2 : దేశంలోనే ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధమున్న తొలి రాష్ట్రంగా గుర్తింపు పొందిన తెలంగాణలోనే ఆన్‌లైన్ జూదం, అక్రమ బెట్టింగ్ కార్యకలాపాలు రోజు రోజుకు పెరుగుతున్నాయని ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న పబ్లిక్ రెస్పాన్స్ ఎగనెస్ట్ హెల్ప్‌లెస్‌నెస్ అండ్ యాక్షన్ ఫర్ రిడ్రసల్ (ప్రహార్) వెల్లడించింది. రాష్ట్ర వ్యాప్తంగా సర్వే నిర్వహించిన ప్రహార్ రాష్ట్రంలో ఆ అంశాల్లో ఉన్న తీవ్రతను బహిర్గతం చేసింది. ప్రహార్ జాతీయ కన్వీనర్ అభయ్ రాజ్ మిశ్రా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంచలనమైన విషయాలను వెల్లడించారు. 2017లోనే తెలంగాణలో ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధం అమలు చేసినప్పటికీ ప్రస్తుతం దానికి సంబంధించిన నెట్‌వర్క్‌లు తీవ్రంగా పెరిగాయన్నారు. విదేశీ యాజమాన్యంలోని ప్లాట్‌ఫామ్‌లు, అనామక డిజిటల్ లావాదేవీలు, నియంత్రణ లేని మొబైల్ యాప్‌లు దాని ప్రభావాన్ని మరింత పెంచిందని, తద్వారా కేవలం ఆర్థిక నష్టమే కాకుండా జాతీయ భద్రతకూ ముప్పు ఏర్పడే పరిస్థితి నెలకొందన్నారు. తమ సర్వేలో డేటా దొంగతనం, ఆర్థిక దోపిడీ, రాడికలైజేషన్ వంటివి విదేశీ డిజిటల్ వేదికల ద్వారా దేశంలోని వినియోగదారులను ఎలా లక్ష్యంగా చేసుకుంటున్నాయో వెలుగుచూసిందన్నారు. తెలంగాణలో 2020న నుంచి 2025 మధ్యలో సైబర్ నేరాల సంఖ్య 800 శాతం వృద్ధి చెందినట్లు తేలిందన్నారు. తెలంగాణలో 2017 నుంచి 2025 మధ్య 3,900 బెట్టింగ్, గ్యాబ్లింగ్ కేసులు, 820 సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయని, రూ.21.3 కోట్ల రికవరీలు జరిగాయని, 4,500 మందిని అరెస్టు చేశారన్నారు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌లకు ఇన్‌ఫ్లూయెన్సర్లుగా వ్యవహరించిన 24 మంది సెలబ్రిటీలు, యూట్యూబర్లపై కేసులు నమోదైనట్లు చెప్పారు.



తన అధికారిక నివాసంలో నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలువగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్


## పారిశుధ్యం లోపించకుండా చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న బల్దియా కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

ఖైరతాబాద్, మే 2 : పారిశుధ్య నిర్వహణ సజావుగా సాగాలని బల్దియా కమిషనరర్ ఆర్వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్ జోన్ పరిధిలోని బడా గణేశ్, ఖైరతాబాద్ పార్కు, తెలుగు తల్లి ఫ్లై ఓవర్‌తో పాటు లోయర్ ట్యాంక్‌బండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, సర్కిల్ 17 డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డితో కలిసి పరిశీలించారు. బడా గణేశ్ ప్రాంతంలో పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛ ఆటోడ్రైవర్లతో ఆయన మాట్లాడారు. సీఐబీ కాలనీలోని కార్మికులు వస్తున్నారా లేదా అనే విషయాన్ని ఆరా తీశారు. ఖైరతాబాద్‌లోని పార్కును సందర్శించి పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

## జలమండలి ఉద్యోగులు పదవీ విరమణ



సిటీబ్యూరో, మే02, (నమస్తే తెలంగాణ): జలమండలి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 22 మంది ఉద్యోగులు శుక్రవారం పదవీ విరమణ పొందారు. వీరందరిని ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి, ఉద్యోగులు పాల్గొన్నారు.